క్లుప్తంగా

ఏడో వార్డు సభ్యుడిగా హరిబాబు ఎన్నిక


చలివేంద్ర హరిబాబు

తిరువూరు: తిరువూరు మండలం ఎర్రమాడు పంచాయతీ ఏడో వార్డు సభ్యుడిగా వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు చలివేంద్ర హరిబాబు ఎన్నికయ్యారు. ఈ ఉప ఎన్నిక శనివారం జరిగింది.

మూఢనమ్మకాలు పారదోలేందుకు కృషి

తిరువూరు: ప్రముఖ హేతువాది నరేంద్ర దభోల్కర్ వర్ధంతి కార్యక్రమం స్థానిక నాగార్జున స్కూల్లో ఆదివారం నిర్వహించారు. ప్రజల్లో మూఢనమ్మకాలు పారదోలడానికి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు నరేంద్ర చేసిన కృషిని జనవిజ్ఞాన వేదిక చెకుముకి విభాగ రాష్ట్ర కన్వీనర్ ఎం.హరికృష్ణ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శాస్త్ర విజ్ఞానం పెంపొందించుకునేందుకు కృషిచేయాలని, మూఢాచారాల జోలికి పోవద్దని సూచించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, స్థానిక ప్రతినిధులు రాంప్రదీప్, సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావులు నరేంద్ర దభోల్కర్‌కు నివాళులర్పించారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



ముసునూరు: వైఎస్సార్ బీమా పథకం పేదల జీవితాలకు తోడుగా ఉండి, బాధితులకు వారి జీవితాలపై నమ్మకం, ధీమా కలిగిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకుడు తోట మురళీ అన్నారు. చెక్కపల్లి గ్రామానికి చెందిన దోమతోటి ఎఫ్రాయిము ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతను వైఎస్సార్ బీమా పథకంలో సభ్యుడు కావడంతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను నామినీగా ఉన్న అతని భార్య ప్రిస్కిల్లాకు ఆదివారం అందజేశారు. మిగిలిన నగదు రూ.90 వేలను బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు వెల్ఫేర్ అసిస్టెంట్ దువ్వు ఆనంద్ తెలిపారు.వైఎస్సార్ సీపీ నాయకులు చిలుకూరి దేవేంద్ర, తల్లిబోయిన సంపతరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారికి ప్రశంసాపత్రం



తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయాధికారి కే పద్మావతికి స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రకటించిన సేవా పురస్కారాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు విజయవాడలో అందజేశారు. గ్రంథాలయ నిర్వహణలో పద్మావతి చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆశీస్సులు



విస్సన్నపేట: వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి, వేమనకుమారి దంపతుల కుమార్తె తేజశ్విని, ప్రవీణ్‌రెడ్డి వివాహ రిసెప్షన్ కార్యక్రమం స్థానిక వికాస్ బీఈడీ క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు, రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కర రెడ్డి తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.


ధరవ్యత్యాసం పంపిణీ

విస్సన్నపేట: కృష్ణా మిల్క్ యూనియన్ తిరువూరు పరిధిలో విస్సన్నపేట మండలంలో పలు గ్రామాల్లో 2023–24 సంవత్సరానికి మొదటి విడత ధర వ్యత్యాసం పంపిణీ చేసినట్లు పాల శీతలకేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి ఆదివారం తెలిపారు. తాతకుంట్ల రూ.1,10,385, పుత్రేలలో రూ.1,54,740, చంద్రుపట్లలో 94,0,52లు ధర వ్యత్యాసాన్ని పాలు పోస్తున్న రైతులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆయా సంఘ అధ్యక్షులు ఎం.వెంకట కేశవరావు, మదిరెడ్డి వనజ, భాగ్యమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు ప్రవేశ పెట్టిన కల్యాణమస్తు పథకం ద్వారా పాలు పోస్తున్న కుటుంబంలో వివాహం సందర్భంగా తాతకుంట్లలో దమ్ములపాటి శివరామకృష్ణ కుమార్తె వివాహానికి రూ.20 వేలు విలువ గల గోల్డ్ కాయిన్, వేమిరెడ్డిపల్లిలో రామినేని అంజలి కుమార్తె వివాహం సందర్భంగా ఆమెకు రూ.20 వేలు విలువగల గోల్డ్ కాయిన్ అందజేసినట్లు మేనేజర్ పేర్కొన్నారు.

ఎస్‌హెచ్‌జీలకు ఆర్థిక పరిపుష్టి

- స్వయం సహాయక సంఘాలకు సకాలంలో రుణాల మంజూరు
- సున్నా వడ్డీ పథకం క్రమం తప్పకుండా అమలు
- ఆసరాతో మహిళలకు చేయూత


గంపలగూడెంలో సమావేశం అయిన స్వయం సహాయక సంఘాల మహిళలు (ఫైల్)



గంపలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీలు) పరిపుష్టితకు అన్ని రకాల చర్యలు చేపడుతోంది. గతంలో ఎస్‌హెచ్‌జీలకు రుణం మంజూరు కావాలంటే మహిళలు ఎన్నో కష్టాలు పడేవారు. రుణ పరిమితి కూడా తక్కువగానే ఉండేది. గతంలో సున్నా వడ్డీ అమలు కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర పగ్గాలు చేపట్టిన తర్వాత స్వయం సహాయక సంఘాల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా డ్వాక్రా రుణాల మాఫీని ఆసరా పేరిట వాయిదాల ప్రకారం అమలు చేయడమే కాకుండా, సకాలంలో సంఘాలకు రుణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆసరా నగదు ఇప్పటికే మూడు విడతలు మహిళల చేతికిరాగా మరో విడత మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్వాక్రా మహిళలకు చేయూత

ఆసరా నగదు డ్వాక్రా మహిళలకు ఎంతో చేయూతనిచ్చింది. ప్రస్తుతం ఎస్‌హెచ్‌జీలకు కావాల్సిన రుణంసైతం దరఖాస్తు చేసిన కొన్ని రోజుల వ్యవధిలోనే త్వరితగతిన మంజూరువుతోంది. రుణ పరిమితి కూడా గతంలోకంటే పెంచారు. ఇంతకుముంది రూ.10 లక్షలు అధికంగా రుణాలు ఇవ్వగా ప్రస్తుతం బ్యాంకుల్లో రూ.20 లక్షల వరకు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళలకు సున్నా వడ్డీ రాయితీ కూడా ఎప్పటికప్పుడు జమ చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముందు సున్నా వడ్డీ అమలు సక్రమంగా కొనసాగలేదని, ప్రస్తుతం ప్రతి ఏడాదీ క్రమం తప్పకుండా సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పలువురు మహిళలు పేర్కొన్నారు. గంపలగూడెం మండలంలో 1,908 స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి.

సున్నా వడ్డీ పథకంలో రూ.3.55 కోట్లు విడుదల

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో భాగంగా మండలానికి గడచిన నాలుగు సంవత్సరాలుగా రూ.3,54,87,000ను ఎస్‌హెచ్‌జీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. 2019–20 సంవత్సరంలో 1,577 గ్రూపులకు రూ.101.08 లక్షలు, 2020–21 సంవత్సరంలో 1,678 గ్రూపులకు రూ.97.85 లక్షలు, 2021–22 సంవత్సరంలో 1,595 గ్రూపులకు రూ.64.81 లక్షలు, 2022–23 సంవత్సరానికిగాను ఇటీవలనే 1,534 గ్రూపులకు రూ.91.13 లక్షలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల గ్రూపుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది.

రూ.100.21 కోట్ల రుణాల పంపిణీ

గడచిన ఆర్థిక సంవత్సరంలో (1-4-2022 నుంచి 31-03-2023 వరకు) వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ బ్యాంక్ శాఖల ద్వారా పలురకాల రుణాలను రూ.100.21 కోట్లు ఎస్‌హెచ్‌జీలకు పంపిణీ చేశారు. లింకేజీ రుణాలుగా 815 గ్రూపునకు రూ.99.19 కోట్లు పంపిణీ చేశారు. ఉన్నతి పథకంలో 155 మందికి రూ.77 లక్షలు, పెరటి కోళ్ల పథకంలో రెండు విడతలుగా 160 యూనిట్లకు గాను రూ.7.04లక్షల కోళ్లను పంపిణీ చేశారు. పాడిగేదెల పంపిణీలో భాగంగా 12 మందికి రూ.9.60 లక్షలు, పొట్టేళ్ల పంపిణీలో భాగంగా 16 మందికి రూ.9లక్షల విలువైన వాటిని మండలంలో పంపిణీ చేశారు.

ఆసరా పథకంలో రూ.39.22 కోట్ల చెల్లింపు

ఎన్నికల్లో మహిళా తల్లులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకంలో రూ.3,922.44కోట్లు విడుదల చేశారు. మండలంలోని 1,908 స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ లబ్ధిచేకూరింది. మరో విడత ఈ సంఘాలకు రూ.13.07 కోట్లు జమకావాల్సి ఉంది.

సున్నా వడ్డీ రాయితీ ఇస్తున్నారు



వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో స్వయం సహాయక సంఘాల రుణాలపై వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా చెల్లిస్తోంది. దీంతో మహిళలపై వడ్డీభారం లేకుండా పోతోంది. బ్యాంక్‌ల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో కొత్త రుణాలను ఇస్తున్నారు. మా తిరుపతమ్మ గ్రూపునకు కొత్తగా రూ. 12 లక్షల రుణం పొందాం.

– వేర్ల రేణుక, తిరుపతమ్మ గ్రూపు సెకండ్ లీడర్, అమ్మిరెడ్డిగూడెం, గంపలగూడెం మండలం

ఆసరా ఎంతగానో ఉపయోగపడుతోంది



వైఎస్సార్ ఆసరా పథకంలో ఎస్‌హెచ్‌జీలకు విడుదల చేస్తున్న రుణ మాఫీ నగదు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీని అమలు చేస్తున్నారు. మహిళల అభ్యున్నతికి ఇది ఎంతో దోహదం చేసింది. ఇప్పటికే మూడు విడతలు రుణ మాఫీ నగదు వచ్చింది. మరో విడత రావాల్సి ఉంది.

– వేమిరెడ్డి నాగేంద్ర, శివాంజనేయ గ్రూపు లీడర్, సత్యాలపాడు, గంపలగూడెం మండలం

రూ.20 లక్షల వరకు రుణం పంపిణీ



స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ ద్వారా రూ.20లక్షల వరకు లింకేజీ రుణాలు ఇస్తున్నారు. దీంతో మహిళల అవసరాలు తీర్చుకుని ఆర్థికంగా బలపడుతూ, కుటుంబాల పోషణ గావిస్తూ, సకాలంలో తిరిగి రుణాల చెల్లింపులు చేస్తున్నారు.

– వెదురు లింగమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు, గంపలగూడెం

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

- వైఎస్ జగన్ రెండోసారి సీఎం కావడం ఖాయం
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు


నూజివీడులో సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన అడవినెక్కలం పంచాయతీ సర్పంచ్ వేము రాజు, వార్డు సభ్యులు పులపాక పుల్లారావు, కొడవటి వనిత, కందుల మంగమ్మలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ విజయం సాధించిందని, దీనిని బట్టి ప్రజల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత లేదనే విషయం స్పష్టమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు ఏకమైనా జగన్ విజయాన్ని ఆపలేరన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల్లో విశ్వసనీయత, అపారమైన నమ్మకం ఉందన్నారు. ఒకవైపు ప్రజాసంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూనే మరోవైపు ఆస్పత్రులు, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామగ్రామాన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి ప్రజలకు సేవలను వారి గడప వద్దకు ప్రభుత్వం తీసుకెళ్లిందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఐదు మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తున్నాయని, పోర్టులను శరవేగంగా నిర్మిస్తున్నారన్నారు. అడవినెక్కలం సర్పంచ్‌తో పాటు ఐదు వార్డు సభ్యులను కైవసం చేసుకున్నామని, దీనిని బట్టే ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న విషయం అర్థమైందన్నారు. టీడీపీ ప్రభుత్వం గతంలో రాష్ట్రానికి గాని, నూజివీడుకు గాని చేసేందేమీ లేదన్నారు. రాజధానిగా నూజివీడు ప్రాంతాన్ని ప్రకటించి తుళ్లూరు ప్రాంతంలో భూములు కొనుక్కున్న అనంతరం అక్కడ రాజధానిని పెట్టి నూజివీడుకు తీరని ద్రోహం చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. రాబోయే రోజుల్లో కూడా వైఎస్సార్ సీపీనే అధికారంలోకి వస్తుందని, టీడీపీ మునిగిపోయే నావ అని, దానిని పట్టుకోవడం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, మండల, ముసునూరు అధ్యక్షులు శీలం రాము, పోలిమెట్ల శివ, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, నాయకులు మొక్కపాటి కిరణ్, ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, ఆరేపల్లి రాంబాబు, రేగుల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మద్దతుతో గెలుపొందిన వార్డు సభ్యులు వీరే


కె.మంగమ్మ, ఈదులగూడెం ఏడో వార్డు సభ్యురాలు


సునీత, ఎస్‌ఏపేట 4వ వార్డు సభ్యురాలు


డి.మహేశ్వరరావు, వేల్పుచర్ల 10వ వార్డు సభ్యుడు


పి.పుల్లారావు, అన్నవరం ఐదో వార్డు సభ్యుడు


కె.వనిత, ముసునూరు 11వ వార్డు సభ్యురాలు

నూజివీడు: నియోజకవర్గంలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో నిర్వహించిన పంచాయతీ ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు పలువురు విజయం సాధించారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం పంచాయతీ సర్పంచ్‌గా వేము రాజు 323 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఈదులగూడెం ఏడో వార్డు సభ్యురాలిగా కందుల మంగమ్మ, ఎస్‌ఏపేట 4వ వార్డు మెంబర్‌గా ఉల్లిబోయిన సునీత, ముసునూరు మండలం వేల్పుచర్లలో 10వ వార్డు సభ్యుడిగా దుక్కిపాటి మహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూజివీడు మండలం అన్నవరంలో పులపాక పుల్లారావు, ముసునూరులో కొడవటి అనిత వార్డు సభ్యులుగా పోటీలో నిలిచి విజయం సాధించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రెడ్డిగూడెం: గ్రామ పంచాయతీ పరిధిలోని సినిమా హాల్ సెంటర్ పక్కన ఉన్న బోసు మెకానికల్ సెంటర్ దగ్గర అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు చింతిరాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు చింతిరాల ఫ్లారెన్స్ 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి శుక్లాలు, కంటి పొరలు ఉన్న 12 మందిని విజయవాడ చైతన్య కంటి ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. పల్లెపాము ఆంథోని, సీహెచ్ బోసు, సిరి ఆప్టికల్స్ వెంపటి సురేష్ పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తిరువూరు: మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధుల బారిన పడకుండా సమతుల ఆహారం తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ వల్లభనేని రవీంద్ర సూచించారు. స్థానిక నాగార్జున స్కూలు ఆవరణలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. రోజూ క్రమం తప్పని వ్యాయామం, మితాహారం తీసుకోవడం ఆరోగ్యకర జీవనానికి తోడ్పడతాయని తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఏలూరు జిల్లాల నుంచి సుమారు రెండు వేల మంది రోగులకు ఈ వైద్యశిబిరంలో మధుమేహ, రక్తపోటు వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇచ్చారు. వైద్యులు రాజేశ్వరి, లక్ష్మణరావు, తేజ వైద్యసేవలందించారు. జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, హరికృష్ణ, పాపారావు, సుదర్శన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై అదనపు పనిభారాన్ని తగ్గించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి డీఎస్సీ నిర్వహించాలని, జీఓ 117 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన సూచించారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, సుందరయ్య, గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘నాడు–నేడు’తో ఆశ్రమ పాఠశాలకు మహర్దశ

- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వసతులు
- పెరిగిన విద్యార్థుల హాజరుశాతం


ఎ.కొండూరులో నాడు–నేడు పనులతో రూపుదిద్దుకున్న గిరిజన ఆశ్రమ పాఠశాల

ఎ.కొండూరు: జిల్లాలోనే ఏకైక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌కు నాడు–నేడు పనులతో మహర్దశ పట్టింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలను ముస్తాబు చేశారు. ఎ.కొండూరు అడ్డరోడ్డు చైతన్యనగర్‌లో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 314 మంది విద్యార్థులున్నారు. 11 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

రూ. 53 లక్షలతో నాడు–నేడు పనులు


ఈ పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులకు మొదటి విడత నాడు–నేడు పథకం ద్వారా రూ.22 లక్షలతో తాగునీరు, విద్యుత్ సరఫరా, బెంచ్‌లు ఏర్పాటు చేశారు. భవనానికి మరమ్మతులు చేయించి రంగులతో తీర్చిదిద్దారు. అన్ని రకాల వసతులు సమకూర్చడంతో పాఠశాల కళకళలాడుతోంది. రూ.31 లక్షలతో ప్రహరీగోడ నిర్మించారు.


నాబార్డు నిధులు రూ.కోటితో పనులు

ఈ పాఠశాలలో నాబార్డు నిధులు రూ.కోటీ 15 లక్షలతో పనులు చేయించారు. నూతనంగా భోజనశాల నిర్మించారు. సీసీ రహదారులు వేయడం, హాస్టల్‌కు ప్రహరీగోడ నిర్మాణం, రూ.25 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మాణం, 20వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీరు ఓవర్ హెడ్ ట్యాంక్, విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలాన్ని చదును చేయించారు. స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి సహకారంతో ఈ పాఠశాల రూపురేఖలు మారాయి. ఇటీవల ఈ పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు, భోజనశాల, అదనపు భవనాన్ని ఎమ్మెల్యే కే రక్షణనిధి ప్రారంభించారు.

70 మంది విద్యార్థులు చేరిక

విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చడంతో పాఠశాల కళకళలాడుతుండటంతో పాటు ఉపాధ్యాయుల కొరత లేకపోవడం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం, జగనన్న విద్యా కానుక అమలు కావడంతో ఆకర్షితులైన విద్యార్థులు ఈ ఏడాది ఏ.కొండూరు, తిరువూరు, విస్సన్నపేట, మైలవరం, రెడ్డిగూడెం, నూజివీడు మండలాల నుంచి పాఠశాలలో చేరారు. ఈ ఏడాది 70 మంది విద్యార్థులు పాఠశాలలో చేరడం జరిగింది. ఈ మండలంలో అధికశాతం గిరిజనులు ఉండటంతో 70 శాతం సీట్లు వాళ్లకే కేటాయించారు. ఎస్సీలకు 10 శాతం, బీసీలకు 10శాతం, ఓసీ విద్యార్థులకు 10 శాతం మంది ఈ పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ఆశ్రమ పాఠశాల ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మారి నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో విద్యార్థులు ఈ పాఠశాలలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు.


నూతనంగా నిర్మించిన విద్యార్థుల భోజనశాల


భోజనం చేస్తున్న విద్యార్థులు

నాణ్యమైన విద్యను అందిస్తున్నాం

అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, కొత్త మెనూ, ట్యాబ్లు పంపిణీ, సీబీఎస్ఈ విద్యా విధానం, ఐఎఫ్‌పీ ప్యారల్ బోర్డు ద్వారా విద్యా విధానం, ఇంగ్లిష్ మీడియం అమలవుతోంది. దీంతో పాటు అన్ని వసతులు కలిస్తుండటంతో తల్లిదండ్రులు ఆకర్షితులై ఈ పాఠశాలలో విద్యార్థులు చేరుస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.

– జి.కవిత, హెచ్‌ఎం

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


బాబురావు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఫెర్రీ ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు పులి బాబురావు (55) అనారోగ్యంతో మృతి చెందడంతో మండలంలోని పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు. ఇటీవల కంటి సమస్యలు తలెత్తడంతో అనారాగ్యానికి గురయ్యాడు. ఆరోగ్యం సహకరించక పోవడంతో కొద్ది రోజులుగా మెడికల్ లీవ్ పెట్టి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం విషమించడంతో ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఇతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు బాబురావు మృతదేహానికి నివాళులర్పించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మైలవరం: మండలం కొత్తగూడెంకు చెందిన మంకెన గోపయ్య కొండపల్లి ఐడీఏలోని ప్రైవేట్ కంపెనీలో హెల్పర్‌గా పనిచేసేవాడు. ఇటీవల గోపయ్య విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా మైలవరం ఊరి వెలుపల వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్ భద్రాచలం వైపు వెళుతూ ఢీకొంది. ఈ సంఘటనలో గోపయ్య మృతి చెందాడు. తోటి హెల్పర్లు, డ్రైవర్‌లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శేషగిరిరావు స్పందించి రూ.55వేలను ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు సున్నా వడ్డీ చెక్కుల పంపిణీ

చాట్రాయి: డ్వాక్రా గ్రూపు మహిళలకు సున్నా వడ్డీ రాయితీ చెక్కులను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేయనున్నట్లు వెలుగు ఏపీఎం శేఖర్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ‘స్పందన’

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే వాటిని గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. మండలంలోని వివిధశాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

రెడ్డిగూడెం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఏఎస్సై గణేష్ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిఘా పెంచామని, ఏదైనా గొడవల్లో కానీ గొడవలు పక్కన నిల్చుని ప్రోత్సాహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సత్ప్రవర్తన కలిగిన రౌడీ షీటర్లను గుర్తించి, డిసెంబర్‌లో రౌడీ షీట్లు తొలగిస్తామని పేర్కొన్నారు.

24న మండల పరిషత్ సమావేశం

ఇబ్రహీంపట్నం: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవీ.రామకృష్ణనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించనున్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రత్యేక ఆహ్వానితులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం ముసునూరు మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం కుంటం బాబు ఆదివారం తెలిపారు. ముసునూరు జెడ్పీ హైస్కూల్లో జరిగే డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ పంపిణీ సంబరాల కార్యక్రమంలో పాల్గొని, మెగా చెక్కును మహిళలకు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సమాఖ్య సంఘాల మహిళలు సకాలంలో హాజరుకావాలని కోరారు.